# తీరనిసమస్య

ఆశ్చర్యంతో అందుకున్నాను. ఆఫీసులో అందరూ కళ్లు పెద్దవిచేసి చూశారు. రిజిష్టర్

లెటర్ అనేదానికంటే పార్సిలంటే బాగుంటుంది. కనీసం నలభైపేజీలైనా ఉంటుంది. బాస్ రాలేదుకనుక తీరిగ్గా విప్పాను. పైన వుండే అడ్రసునుబట్టి అది 'అప్పు' దగ్గర్నుంచి వచ్చిందని నాకుతెలుసు. అతనూ నేనూ చెన్నపట్నంలో మెడికల్‌కోర్సు పూర్తిచేశాం. ఆ తరువాత ఏడెనిమిదిసంవత్సరాలకు కలకత్తాలో కలుసుకున్నాం. రెండు సంవత్సరాలుగడిచాక మళ్లీ విడిపోయాం. తరువాత చాలాకాలానికి అతని దగ్గర్నుంచి వచ్చిన మొదటి ఉత్తరంయిది. అతనికి తెలుగు బాగాతెలుసు. అతన్తో మాట్లాడిన ఏ వ్యక్తీ కూడా అతను తెలుగువాడుకాడని అనలేరు. అంత స్పష్టంగా, చక్కగా,అనర్గళంగా మాట్లాడతాడు. అప్పు తన జీవితకాలంలో చాలాచోట్లు తిరిగాడు. రకరకాల మనుష్యుల్ని కలుసుకున్నాడు. మనస్తత్వాల్ని పరిశీలించాడు. కుర్చీకి జేరబడి ఉత్తరం చదవటం మొదలుపెట్టాను.

* * *

డియర్ మూర్తీ,

ఈ ఉత్తరం నీకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈ దీర్ఘకాలమౌనానికి కారణంవివరించి నీ క్షమాపణ కోరటం నా అభిప్రాయం. క్రిందటిసారి నిన్ను అనుకోకుండా బొంబాయిలో కలుసుకున్నప్పుడు యీవిషయం చెబుదామనుకున్నాను. కాని ఎందుకో సిగ్గుపడి వూరుకున్నాను. నీవంటి మిత్రుడిదగ్గర ఏసంగతి దాచటం నాకిష్టంలేదు. అందుకే రాస్తున్నా. పూర్తిగా వివరిస్తేనేగాని సంగతులు బోధపడవు. అందుకే నీ సహనాన్ని పరిశీలిస్తున్నా.

ఐదారిళ్లవతలవున్న రామదాసింట్లో నలుగురూ చేరి ఏదో తీవ్రంగా చర్చిస్తున్నారు. మధ్యమధ్య ఏడుపులు, శాపనార్థాలు వినిపిస్తున్నాయి. వెళ్లి చూడాలన్నకోరిక కలిగినా వెళ్ల బుద్ధి వేసిందికాదు. చదువుతున్న భగవద్గీత టేబిలుమీద వుంచి మూగభాషలో ప్రార్థనలు చేశాను.

కళ్లు రెండూ తెరవటానికి వీల్లేకుండా ఎవరో దోబూచులాడుతున్నారు. తడిమి చూశాను. లేతఆకులా మృదువుగావున్న చేతులు. నాకు నేనే సృష్టించుకున్న నిశ్శబ్దాన్ని చీలుస్తూ గాజులు కలుక్కుమన్నాయి. ఆపుకుందామనుకున్నా దాగని చిరునవ్వు విచిత్రధ్వని చేస్తూ మధ్యమధ్య పేలుతూంది. నాకు తెలుసు. పాపే అయుంటుంది. అంత చిన్న గుండెలో ఇంత పెద్దనవ్వు ఎంతసేపు దాగివుంటుంది కనక! టపాకాయలా ఒక్కసారి పేలింది. నిప్పురవ్వలకు బదులు ఏరుకోలేని ముత్యాలు నేలమీద దొర్లి పార్లిపోయాయి.

'తాతయ్యా! రామదాసుగారింటో దొంగలు పడ్డారట తెలుసా? అందుకే ఈ గడబిడ. ఆయన వుంగరం ఎప్పుడూ వేలికి వుండేదా మరి. నిన్నరాత్రి అదికూడా తీసి పెట్టెలో వుంచారట- అన్నీ కట్టగట్టుకుని దొంగ ఎత్తుకుపోయాడు.'

పాప నాకెదురుగా నిలబడి చేతులతో అభినయం చేస్తూ చెప్పుకుపోయింది. తీయని పాటలా, లయబద్ధంగా సాగిపోతూన్న ఆమెమాటలకు, సరైనఅవధిలో గాజులు తాళం వేశాయి.

ఆశ్చర్యం- బాధ- జాలి. అన్నీ కళ్లల్లో కదిలాయి.

'అయితే తాతయ్యా! దొంగలు ఎలావుంటారు? దొంగతనం ఎందుకుచేస్తారు? దేవుడు వాళ్లను పట్టుకుని పోలీసులకు ఎందుకు వప్పజెప్పడు? ఏం దేవుడు తాతయ్యా! దొంగదేవుడు. కొంగలా గుళ్లో జపంచేస్తూ ఫలహారాలు మింగుతాడు.'

ఆమె చూపుడువేలు దూరంగా వున్న సీతారామస్వామి గుడివేపుతిరిగి ఆడింది.

తప్పమ్మా అలమేలు! మనం అలా అనకూడదు. దేవుడు సర్వమంగళాకారుడు-'

'అది సరేకాని దొంగ ఎలావుంటాడు?'

'అతనూ మనలాగే వుంటాడు అలమేలూ! మనలాగే పుట్టి పెరుగుతాడు. కాని మనచుట్టూవున్న సంఘం ఓ విషపు వాతావరణాన్ని సృష్టించి ప్రతివ్యక్తిని దొంగగా మార్చటానికి యత్నిస్తుంది. కొందరు దానివలలో పడతారు. తెలిసిందా అలమేలూ?'

ఇంతవరకూ నేను పాపవంక చూడలేదు. ఆమెకళ్లు గుండ్రంగా తిరిగాయి. కళ్లల్లో బయలుదేరిన ఎర్రదనం బుగ్గలమీదికి- క్రమంగా పెదవులమీదికి వ్యాపించింది.

'నా పేరేమిటో తెలుసా?'

'పాప!' అన్నాను తెల్లబోతూ.

'మరి, అలమేలు, గిలమేలు అని పిలుస్తావేం? నీకేమైనా మతిపోయిందా? నాన్నను రానీ- ఇంజక్షనిమ్మంటాను.'

'మర్చిపోయాను అలమేలూ!' అన్నాను నాలిక్కొరుక్కుంటూ.

మర్చిపోదామకున్న ఓ సంగతిని పాప జ్ఞాపకం చేసింది. ఒక్క ఏడాదిలో అలమేలు నన్ను పూర్తిగా అర్థంచేసుకున్నది. కాని నేనుమాత్రం ఆమెను తెలుసుకోలేకపోయాను. కథంతా పూర్తిగా వ్రాస్తున్నాను. చదివాక అంతా మీకే తెలుస్తుంది.

* * *

మెడికల్ ఆఫీసరు నన్నుచూసి అర్థపూరితంగా నవ్వాడు.

'ట్రెయినింగ్ పూర్తయింది. నువ్వు క్వాలిఫైడ్‌డాక్టరువి. ప్రాక్టీసు ఎక్కడ పెడతావ్?' అని అడిగాడు. నేనంటే చెప్పరాని అనురాగం; అభిమానం.

'మీ సలహా తీసుకుందామనుకుంటున్నాను' అన్నాను వినయంగా.

'మీ నాన్నగార్ని నాకు బాగాతెలుసు.'

ఆతరువాత తన మనసులోవున్న భావాన్ని వ్యక్తంచేయకుండా ఏదో రాసుకుంటూ పోయాడు. మా నాన్నగారికి, నా ప్రాక్టీసుకు ఏవిటి సంబంధం? ఆలోచనలు అర్థరహితంగా సాగిపోయాయి. నాన్నగారు ఎప్పుడూ ఒకచోట వుండేవారు కారు. సర్జరీలో ఆయనకున్న అనుభవాన్ని దేశమంతా రుచిచూసింది. రకరకాల మనుష్యులు, మనస్తత్వాలు, కొండలు, అడవులు, పట్నాలు, సిరిసంపదలు, సగంనిద్రలో వయ్యారంగా ఆవులిస్తున్న

ప్రకృతిసౌందర్యం - ఇవన్నీ ఆయనచుట్టూచేరి నృత్యంచేసి విసిగి వేసారి మరోవ్యక్తిని వెదుక్కుంటూ వెళ్లాయి. యాంత్రికజీవితం, ఒకచోట ఒకరకంమనుష్యుల మధ్య వుండడం- ఇవన్నీ అసమర్థుడి వారసత్వపుహక్కులు.

'ఆలోచన తెమిలిందా?' అనడిగాడు ఆఫీసరు. అర్థంలేకుండా నవ్వాను.

'ట్రిచూర్ దగ్గర ఓ లోకల్‌డిస్పెన్సరీకి నిన్ను పంపిస్తున్నాను. అక్కడి మెడికల్ ఆఫీసరుకు యీవిషయమై ఉత్తరం రాస్తున్నా. మీ నాన్నగారికిమల్లే నువ్వుకూడా నాలుగుచోట్లూ తిరిగి అభివృద్ధిలోకి రావాలన్నది నా అభిమతం'

నా కళ్లలో వున్న సంకోచాన్ని అతను పసికట్టాడు.

'భయంగా వుందా? నీకింకా పెళ్లి- పెడాకులూ కాలేదు. ముసలితనం ఇంకా రాలేదు. మళయాళం బాగాతెలుసు. ఇదంతా నీమంచికోసమే. వాదించటానికి అవకాశం యివ్వకుండా బుజంతట్టి వెళ్లిపోయాడు. వారంరోజులతర్వాత ట్రిచూరు స్టేషన్‌లో దిగాను.

ఆనాటి కేరళ దేశపు సొగసు వేరు. చెట్లూ చేమలూ, ఎత్తయిన కొండలు- కొబ్బరి చెట్లు- సర్వత్రా ఇవేకనిపించేవి. ప్రజల ముఖాల్లో అల్లుకుపోయిన అమాయకత్వం- బీదల సంఖ్య ఎక్కువకనుక ఆచార వ్యవహారాలు- దుస్తులు ధరించే విధానం- అందుకనుగుణంగానే వుండేవి.

గంటన్నరకాలంలో పట్టిక్కాడు చేరుకున్నాను. అదే నా మజిలీ. ఆ వూరుకూడా పేరుకు తగ్గట్టుగానే వుంది. ఎక్కడచూచినా ఎత్తయిన పడమటికనుమలు భయంకరంగా కళ్లు కదుపుతూ మధ్యమధ్య భూగోళాన్నంతా అణచివేస్తున్నట్టు శరీరాన్ని కదిలిస్తూ కనిపించాయి. చిన్నపిల్లాడు కాగితంమీదగీసిన పిచ్చిగీతల్లా వంకర టింకరలుగా సాగిపోతున్న కంకరరోడ్డు. రెండువైపులా లోతైనలోయలు వాటినే 'కుదరాంకున్ను' అంటారుట- ఆ లోయలు రెండుమూడు తాటిచెట్లలోతు కలవని, క్రూర జంతువులు నివసిస్తున్నాయని బస్సులోవున్న ప్రయాణికులు వర్ణించారు. దారిమధ్య కండక్టరు రోడ్డువారగావున్న ఓ రాతివిగ్రహానికి కొబ్బరికాయకొట్టి, చెంపలు వాయించుకున్నాడు. దారిలో ఎలాంటి ప్రమాదమూ కలగకుండా వుండటానికీ ప్రార్థన-

డిస్పెన్సరీ చాలా చిన్నది.

కావలసిన మందులు చాలావరకు లేనేలేవు. ఓ ముసిలికంపౌండరు మాత్రం వున్నాడు. అతనిపేరు శ్రీధరన్‌నాయర్. ఆ చుట్టుపక్కలవున్న గ్రామాలకుకూడా ఇదే డిస్పెన్సరీ కావటంమూలాన సైకిలుమీద నేనే వూళ్లన్నీ తిరిగిరావాలి. ప్రజలు గౌరవ మర్యాదలతో ప్రవర్తించి నాబాగోగులు, జీవితక్రమం తెలుసుకోటానికి ఎలాంటి ప్రయత్నమూ చెయ్యలేదు. శ్రీధరన్ ఒంటరిగాడు. అతనికీ, భార్యకూ మధ్య మనస్పర్థలు ఏర్పడి ఇద్దరూ విడిపోయారు. ఆమె ఆచారంప్రకారం మరోవ్యక్తిని పెళ్లిచేసుకుని సుఖంగా వుంది. శ్రీధరన్ అప్పుడప్పుడు తనుచేసిన పనికి పశ్చాత్తాపపడినా అది ఎంతోకాలం నిలిచేదికాదు. 'అహం' దాన్ని తుడిచివేసేది. అందుచేత ఇద్దరంకలిసి డిస్పెన్సరీ వెనకవున్న

ఓ చిన్నగదిలో వండుకు తినేవాళ్లం. అలా రెండువారాలు గడిచాయి.

ఉన్నట్టుండి అతను రాజీనామాచేసి ఎక్కడికో వెళ్లిపోయాడు. ఊళ్లోవున్నవ్యక్తుల్ని గురించి అతనొక్కడే నాకు వివరించిచెప్పేవాడు. ఇప్పుడు ఆలోటు భయంకరంగా విజృంభించింది. జీవితమంటే వెగటుకలిగింది. స్టీవెన్సన్ అన్నట్టు ఏదో అనుకోని, ఊహించని సంఘటన జరక్కపోతే కొందరికి జీవితం కరక్కాయ నములుతున్నట్టుంటుంది. మా నాన్నగారిరక్తం నాలో ప్రవహిస్తూంది కనక నా విషయం కూడా అంతేననిపించింది. మెడికల్ఆఫీసరుమీద అంతులేనికోపం వచ్చింది. నన్ను మరెక్కడికైనా ట్రాన్స్ఫర్ చేయమని కోరుతూ పెద్ద వుత్తరం రాశాను. కొత్త వ్యక్తులు- కొత్త వాతావరణం- ఎందుకొచ్చిన అర్థంలేనిమాటలు - సాయంత్రం బయలుదేరి నడిస్తే వరిపొలాలు- తాటిచెట్లు- విచిత్రంగా చూసే మనుష్యులు- చివరిక్కలిగేది ముళ్లమీద నడుస్తున్న బాధ- అనుభవం. మానసిక సంఘర్షణ- తిండి సరిగ్గాలేకపోవటం- ఆకాశపుటంచులవరకూ ఎగిరే అసంతృప్తి- మనిషిని జీవచ్ఛవంగా మార్చి మంచానవేయటానికి ఇంతకంటే ఏం కావాలి? వచ్చిన మూడువారాలలో జ్వరంతో బాధపడ్డాను.

ఓనాడు మధ్యాహ్నం రెండు గంటలు-

కొత్త కంపౌండరు రెండుమూడుసార్లు వచ్చి ఏదో విజిట్కి వెళ్లాలని జ్ఞాపకంచేశాడు. అతన్ని కసిరి పొమ్మన్నాను. మళ్లీ తలుపుతీసుకుని ఎవరోవచ్చారు. నాకు తెలుసు. ఆ కంపౌండరే అయుంటాడు. అటు తిరిగిచూడకుండా 'ఎన్నిసార్లు చెప్పాలి? నీకు బుద్ధి లేదూ? జ్వరంగా వుందని, లేవలేనని చెప్పేది నీక్కాదు?' అనరిచాను.

'అందుకే, సంగతేమిటో కనుక్కుందామని వచ్చాను.'

ఆ కంఠస్వరం కంకరరాయిని నేలమీద గీసినట్టుంది. వచ్చింది కంపౌండరుకాదని అర్థంకాగానే వెనక్కి తిరిగిచూశాను. ఆయనకూ నాకూ పరిచయం లేకపోయినా తెలుసు. శ్రీధరన్ అయిదారుసార్లు ఆయన్నిగురించి నాకు చెప్పాడు. వూళ్లో వున్న స్థితిమంతుల్లో స్థితిమంతుడు. వందఎకరాలభూమి- బోలెడంత ఆస్తివుంది. లేచికూర్చుని నమస్కరించాను. నల్లటి పెదవులమీద చెదరిపడివున్న నవ్వును ఒకమూలకు కేంద్రీకరింపజేస్తూ నా దగ్గరకు వచ్చి కూర్చున్నారు.

'నారాక మీకు ఆశ్చర్యాన్నికలిగిస్తుంది. రెండుమూడు రోజులుగా వద్దామనుకుంటున్నా. తీరుబడి కలిగింది కాదు. మీకు వంట్లో బాగాలేదని, వండుకోటం అదీ, కుదరటంలేదని విని బాధపడ్డాను. ఇప్పుడెలా వుంది?' ఆశ్చర్యంలోంచి తేరుకోటానికి కొంతసేపు పట్టింది.

'కొంచెం నయం. నా గురించి ఇంత శ్రద్ధతీసుకున్నందుకు కృతజ్ఞత' అన్నాను.

కళ్లల్లో వున్న గంభీరత పెదవులు కదిపింది.

'అలాక్కాదు. మాకోసం మీరు చాలాదూరంనుండి వచ్చి కష్టపడుతున్నారు. మీగురించి ఎవరూ శ్రద్ధ తీసుకోటం లేదు. అంటే నిర్లక్ష్యంతో కాదు. ఎలా సత్కరించాలో తెలియని

అమాయకులు. ఆ లోపాన్ని భర్తీచేసేందుకే నేనువచ్చాను.'

సంభాషణ అలా సాగిపోయింది. చివరకాయన వ్యక్తంచేసిన సంగతి నన్ను దిగ్భ్రాంతిలో ముంచింది. ఆయనింట్లో నాకోసం ఓ గది ఏర్పాటు చేశారుట- తిండిసంగతి తను చూస్తానని,వెంటనే మకాంమార్చమని చెప్పారు. ఆయనపేరు రామయ్యారు గారు. ఆయన అభిమానానికి కారణం ఊహిస్తూ ఊహాపథంలో దారితప్పి యెక్కడికో వెళ్లిపోయాను. వసంతఋతువురాగానే బాధతో మూలుగుతున్న ప్రకృతి పులకరింతలతో పరుగులువేసినట్టు ఈ అనునయ వాక్యాలతో మనసు అడవిపూవుల పరిమళాన్ని వాసన చూసింది. ఇంకా కొంతకాలం అక్కడే వుంటానని మెడికల్ఆఫీసరుకు రాశాను. ఆయన నా వెర్రితనానికి నవ్వుకుంటాడని తెలుసు.

నాలుగురోజులతరువాత ఆయనింటికి బయలుదేరాను. సామాను ముందే వెళ్లింది. సూట్కేసమాత్రం చేతిలోవుంది. పొట్టిగా, లావుగా వున్న రామయ్యారుగారు ముందు నడుస్తుంటే ఏదో గొప్పశక్తి నన్ను సర్వోదయంవైపు తీసుకువెడుతున్నట్టనిపించింది. ఊరిచివర ఆయనయిల్లు- మెయిన్గేటుదాటి లోపల అడుగుపెట్టగానే గులాబి, చేమంతి, నిద్రగన్నేరు పువ్వులు కలుక్కుమని నవ్వాయి.

'ఇదెవరూ? కొత్తడాక్టరుగారా? ఆయనక్కూడా జ్వరం వచ్చిందట' ఈ మాటలు నా దృష్టిని మరోదిక్కుకు మరలించాయి. సుమారు పదిపన్నెండేళ్లుంటాయి. నలుపూ- తెలుపూ కాని రంగు. చెవులకు నేనెప్పుడూ చూడని ఇక్ష్వాకుల కాలంలో ప్రసిద్ధిలోవున్న చిత్రవిచిత్రమైన ఆభరణాలు- ముక్కుపుడకల్లోవున్న రాళ్ళు ధగధగా మెరుస్తూ 'మేం వున్నాం' అన్నాయి. మెడనిండా మోయలేనన్ని గొలుసులు- నగలు- కాసులమాల- పచ్చపరికిణీ- ఎరుపు రవిక- పొట్టి జెడ- కాళ్లకు పట్టాలు- వేళ్లకు పాలిపోతున్నగోరింటాకు రంగు- ఛాందసత్వం మూర్తీభవించి కనిపించింది.

'మా అమ్మాయి- అలమేలు' అన్నాడాయన. గుర్తుకొచ్చింది. ఎవరికో కళ్లు కలిగాయని మందుకోసం వచ్చింది ఈ అమ్మాయే! వంట్లో బాగాలేదని మర్నాడు రమ్మని కసిరికొట్టాను.

గదిలో సామానంతాసర్దాను. నాలుగుగోడలకూ పటాలు- న్యూటన్- ఆర్కిమెడిస్- లూయీపాశ్చర్- షేక్స్పియర్. గోడమీద అలమేలుఫోటోవుంటే బాగుండుననిపించింది. ఆమెతో నాకు సాన్నిహిత్యంలేదు. అలాంటప్పుడు ఈఅనురాగం ఎందుకేర్పడిందో అర్థంకాలేదు. కొందరు వ్యక్తుల్ని చూసీచూడటంతో ప్రేమిస్తాం. వారిలో యిమిడివున్న ఆకర్షణశక్తి లోపాల్ని కప్పిపుచ్చుతుంది. కొన్ని సంవత్సరాలపాటు పరిస్థితుల ఒత్తిడిమూలంగా కలిసివున్నా, ఒకరి మనస్తత్వం మరొకరికి అర్థమైనా, ఎందుకో కొందర్ని ప్రేమించలేం. పైకి నవ్వుతూ తియ్యగా మాట్లాడినా లోపల ఎక్కడో ఓమూలవున్న అసహ్యం పైకిరాలేక గిజగిజ తన్నులాడుకుంటుంది. మెడికల్జర్నల్మీద కళ్లుమాత్రం కేంద్రీకృతమైవున్నా మెదడులోపరుగెత్తే ఆలోచనలు ఇవి. కిటికీతలుపులు రెండుసార్లు దబదబా బాదుకున్నాయి.

గాలి వీచటం లేదు- బాహ్యశక్తి లేనిదే ఏ వస్తువూ కదలదని న్యూటన్ మొదటి

సిద్ధాంతం ప్రతిపాదిస్తుంది. కనక ఆశ్చర్యంతో తలెత్తిచూశాను. కిటీకీలోంచి అలమేలు చూస్తోంది. ఆమె చాలాసేపట్నించి అక్కడ నిలబడివుందని, నా దృష్టిని తనవైపు తిప్పుకోటానికి ప్రయత్నించి ఓడిపోయి తలుపురెక్కల రెక్కలు విరిచిందని ఆమెకళ్లు వివరించాయి. పుస్తకంమూసేసి బయటకు వచ్చాను.

'ఏం కావాలి అలమేలు?' అనడిగాను.

'నాకేం కావాలి? జ్వరంవచ్చినవాళ్లు మీదగ్గరకు రావాలికాని- నాకెప్పుడూ సుస్తీ చేయదు తెలుసా?.... అది సరేకాని మీరిక్కడే వుంటారా? ఆ ప్రశ్న 'వెంటనే దయచెయ్యండి' అన్నట్టువున్నా అలా అనుకునేందుకు ఆధారాలు లేవు.

'అవును. ఇలా లోపలకురా- మంచిమంచి పుస్తకాలు చూపిస్తాను' అన్నాను. పరికిణీ కుచ్చెళ్లు ఎత్తిపట్టుకుని పొట్టి జెడ వుందో, వూడిందోనని వెనక్కి తిరిగి చూసుకుంటూ లోపలకువచ్చి పెట్టెమీద కూర్చుంది. లాంగ్‌మన్స్‌వారి కొన్ని బొమ్మలపుస్తకాలు ఆమె ముందు పడేశాను 'మీకిలాంటి పటాలే నచ్చుతాయా? వీళ్లందరూ దెయ్యాల్లా అలావున్నారేమిటి? దేవుడి పటాలు పెట్టకూడదూ?' అని కొంచెం చనువూ, కోపం చూపిస్తూ అడిగింది.

కనిపించనిదేవుణ్ణి ఆరాధించి చివరకు మోక్షంపొందే దానికన్నా, వీళ్లను స్మరించుకోటం మేలు- నరక బాధలనుభవిస్తున్న మానవులకష్టాలు గట్టెక్కించటానికి వీళ్లంతా త్యాగం చేశారు. చీకటిలో మ్రగ్గి 'భూమి బల్లపరుపుగా వుంది' మొదలైన సిద్ధాంతాలను నమ్మి మూఢనమ్మకాలపిడిలో చిక్కుకుని వెలుతురువుందని మర్చిపోయిన మనుష్యులకు వెలుగుమార్గం చూపించారని ఆమెకు వుపన్యసిద్దామనుకున్నాను. అంతేకాదు. ఈ శాస్త్రజ్ఞులు ఏయేరంగాల్లో కృషిచేసి ఎలా ఎలా అభ్యుదయానికి మెట్లుకట్టారో వివరిద్దామనుకున్నా- సరైనమాటలు వుద్రేకంలో కొట్టుకుపోయాయి. ఆమెకు అర్థంకాదుకూడా. మరుక్షణం నవ్వుకున్నా, 'అలమేలు! నీకు జ్వరం వచ్చిందనుకో!' అని మొదలుపెట్టాను. 'ముందే చెప్పాను. నాకెప్పుడూ జ్వరంరాదని' అంది కోపంతో.

'పోనీ- నాకే జ్వరంవచ్చిందనుకో- దేవుడికి దండంబెడితే తగ్గుతుందా? డాక్టరు రావాలి- ఏదైనా మందివ్వాలి- అవునా? అందుచేత డాక్టరుగొప్పవాడు. అతనిచ్చే మందులు కనిపెట్టింది వీరే కనక వీరందరూ గొప్పవారు' అన్నాను పటాలకేసి చూపిస్తూ. అలమేలు నామాటల్ని జీర్ణంచేసుకుంటుందని కాదు. అంత చిన్నఅమ్మాయి ముందు ఓడిపోకూడదని.

'కాని ఆ గొప్పవాళ్లంతా దేవుడిదయవల్లనే జన్మించారు. ఇదంతా కనిపెట్టేందుక్కా వలసిన మేధాశక్తిని ఆయనే ప్రసాదించాడు. సృష్టికంతా మూలకారణం 'ఓం' అన్న శబ్దం- అందులోంచి అందరూ జన్మించారు. అదీ భగవంతుడి స్వరూపం!'

ఆశ్చర్యంలో ఐక్యమైపోయాను.

'అలమేలు? ఇదంతా ఎక్కడ నేర్చావు?'

'మా అమ్మాయిసంగతి మీకు బాగాతెలియదు గామోలు. సంస్కృతం చదువుకుంది.

సంగీతం నేర్చుకుంది. మొన్నమొన్నటిదాకా ఒకాయన నేర్పేందుకు వచ్చేవాడు. భగవద్గీతలో శ్లోకాలు చాలావరకూ కంఠస్థం... అలమేలు! అప్పుడే సాధింపు మొదలెట్టావా?' అని రామయ్యారుగారనేసరికి ఆమె సిగ్గుపడుతూ వెళ్లిపోయింది. ఆయన నా యోగక్షేమాలు కనుక్కుని, భోజనాదుల విషయంలో ఏర్పాట్లుగురించి వివరించారు. మనసులో నమస్కరించాను.

ఆ మర్నాడు వుదయం-

తోటనిండా రకరకాలపువ్వులు మేలుకున్నాయి; ఆకర్షణపత్రాలను విదల్చి ముసిముసిగా నవ్వాయి. ఆశ దాగిందికాదు. ఓ రోజాపువ్వు కోశాను. చేమంతిపువ్వు దగ్గరకు చెయ్యి వెళ్లేసరికి వెనకనుండి హూంకరింపు వినిపించింది. అలమేలు కాళికామ్మవారిలా నిలబడివుంది.

'మీరు పొద్దున్నే స్నానంచెయ్యకుండా పువ్వులెందుకు కోస్తున్నారు? అదీకాక అవన్నీ దేవుడికి. మీరు వాసనచూసి పారేసేందుక్కాదు.' అంది.

ఊరుకోక ఆమెకోపాన్ని రెట్టించాను.

'ఏం? కోస్తే మీదేవుడు ఏంచేస్తాడు?'

'శుద్ధిగా చేయటంలేదు కనక తిన్నగా నరకానికి పంపిస్తాడు.'

'నాకు నరకమంటే భయంలేదు. అదో అభూతకల్పన-'

ఈమాటు ఆశ్చర్యపడటం ఆమెవంతు.

'భయంలేదూ? అక్కడ ఏం జరుగుతుందో తెలిస్తే మీరూ జడుసుకుంటారు. అక్కడకు వెళ్లినవాళ్లందర్నీ సలసలమరిగే నూనెలో పడేస్తారు. రంపంతో కోస్తారు. శూలాలతో పొడుస్తారు. తల్లకిందులుగా నిలబెట్టి నోట్లో నిప్పులుపోస్తారు. అవన్నీ అనుభవించాలని వుందా?'

అలమేలు స్నానంచేసింది- తడిగావున్న జుట్టంతా విరియబోసుకుంది. ఓడిపోయినట్టు ఒప్పుకుని గదికివచ్చాను.

రెండు వారాలు గడిచాయి.

నిరాశ ఆవరించినా, ఏమాత్రం వెలుగు కనిపించినా తిరిగి ఆశమొలకెత్తుతుంది. ఆశ అనేది జనిస్తూ, పెరుగుతూ, మరణిస్తూవుంటుంది. జాగ్రదవస్థలోవున్న వ్యక్తుల్ని అలమేలులాంటి మనస్తత్వం మేల్కొలుపుతుంది. నిజానికి ఆమెకూ, నాకూవున్న అనుబంధం ఎలాంటిదో తెలియదు. ఆ పల్లెటూళ్లో వున్నందున నా భవిష్యత్తును చేతులారా సమాధిచేసుకుంటున్నాను. అయినా ఆత్మజ్ఞానంకలుగలేదు. పూర్వజన్మలో ఆమె నాకేదో అయ్యుండాలి. ఏదోవిధమైన ఋణానుబంధంవుంటుంది. అందుకే మళ్లీ ఓచోట కలిశాం- ఆమెను చూడాలని, ఏదో అర్థంలేని, అంతులేని కబుర్లుచెప్పాలని వుంటుంది. ఇలా వేదాంతంయిచ్చే తృప్తి తాత్కాలికమైనా దాన్నుండి తప్పించుకోలేం.

అలమేలు ఏదోవిధంగా నన్ను సాధించటానికి ప్రయత్నించటం- చివరకు ఓడిపోయి వుడుకుమోత్తనంతో వెళ్లిపోవటం పరిపాటైపోయింది. 'చెట్టిచ్చి' కాయలు తీసుకొచ్చి నాముందుపడేసి తినమనేది. నాకిష్టంలేదని ఎంతచెప్పినా వినదు. ఉదయంలేచి అర ఫర్లాంగుదూరంలోవున్న ఎలిమెంటరీస్కూలుకు వెళ్ళి ముళ్లకంచెలమీదకాసే ఆ కాయలు కోసుకురావటం ఆమె దైనందిన కార్యక్రమాలలో ఒకటి. వగరుగా పుల్లగావుండే ఆ కాయల్లో దాగివున్న అమృతత్వం ఏవిటోమరి?

ఆవేళ ఆదివారం.

సాయంత్రం ఎక్కడకూ వెళ్లనవసరం లేదు. సూర్యాస్తమయంకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను.

'త్వరగా బయలుదేరండి' అంది అలమేలు. పట్టుపరికిణీ- జాకెట్టు- మొదటిరోజు చూసిన దానికంటె ఎక్కువనగలున్నాయి. చేతిలో వెండిపళ్లెం. దాంటో హారతి కర్పూరంముద్ద- పెద్దపువ్వుల దండ- ఓ చిన్న వెండిగిన్నెలో నూనె- అంతా పవిత్రమయం.

'అలమేలు! నీకెన్నోసార్లు చెప్పాను. దేవుడిమీద నాకు నమ్మకంలేదు- గౌరవభక్తులు అసలు లేవు. ఎందుచేతనంటే నేనెప్పుడూ ఆయన్ని చూడలేదు' అన్నాను కదలకుండా.

'అదంతా నాకు తెలిసిందే- ఇవేళ ఏకాదశి- దేవుణ్ణిచూపిస్తాను పదండి.' అంది మందలింపుగా. అందులో ఎలాంటి ఆకర్షణవుందోకాని ఆమెవెంట బయలుదేరాను.

ఊళ్లోంచి వెళ్లకుండా డొంకతిరుగుడుగావున్న దోవంటవెడుతున్నది. ఎందుకో నాకు తెలియదు. పదినిమిషాలు నడిచాక ఓ 'ఇట్లి' గుండా వెడుతున్నాం. (రెండువైపుల ముళ్లకంచెలో వున్న చిన్నసందుకు మలయాళంలో 'ఇట్లి' అంటారు.) హఠాత్తుగా ఓ యింటిముందు ఆగింది. మట్టిలో కలిసిపోయి ఇద్దరు కుర్రాళ్లు ఆడుకుంటున్నారు.

'మీయమ్మను పిలు.' అంది. ఇద్దరూ లోపలకు పరుగెత్తారు. మరో రెండునిమిషాల్లో ఓ ముసిలావిడ బయటకువచ్చింది. ఆమె వేషాన్నిబట్టి వెంటనే గ్రహించాను. ఆమె 'ఈయవన్' అనేజాతికి చెందుతుంది. పొలాల్లో పనిచేసేది వీళ్లే. ఆనాడు బ్రాహ్మణులకు వీరికీ బద్ధవైరం వుండేది. 'ఈయవన్'జాతి నీచజాతి- వాళ్లకు పదిగజాల దూరంలో వుండాలి. ఏమాత్రం దగ్గరకు వెళ్లినా మైలపడతారు. స్నానం చెయ్యాలి. ముట్టుకుంటే మహాపాపం. వీళ్లు గ్రామంలో ప్రవేశించేటప్పుడు 'ఓ' అంటూ ధ్వనిచేస్తూ రావాలి. ఆ ధ్వని వినగానే వారి రాక తెలుసుకుని ముందు జాగ్రత్తపడమని అర్థం- హెచ్చరిక- అంతకంటే అధమమైనజాతి 'నాయాడి'జాతి. ఈజాతివారిని ముట్టుకుంటే నూటెనిమిదిసార్లు నీటిలో మునగాలట. అయిదారేళ్ల క్రితం ఓ చిన్నకుర్రాడు పొరపాటున ఓ 'నాయాడి'ని ముట్టుకున్నాడని, ఛాందసుడైన అతని తండ్రి నూటెనిమిదిసార్లు నీటిలో ముంచెత్తాడని, తత్కారణంగా ఆ కుర్రాడు వాతంకమ్మి చనిపోయాడని శ్రీధరన్ ఇదివరకు నాకు చెప్పాడు. ఈ ఆచారవ్యవహారాలు ఘోరంగా వితండనృత్యం చేసినా, దాని బాగోగులు పరిశీలించి నిర్మూలించే శక్తి, మనస్థైర్యం ఎవరికీ లేకపోయాయి. చిన్నతువ్వాలు చుట్టుకుని, మరో

చిన్నతువ్వాలుతో గుండెకప్పుకున్న ఆమెను చూడగానే ఈ విషయాలన్నీ జ్ఞప్తికివచ్చాయి.

'ఏవండీ! బుల్లమ్మాయిగారూ?' అంది తమలపాకులు నములుతున్న నోటితో ముసలావిడ.

'కండు ఇంట్లో లేడూ?'

ఆ ముసలావిడముఖంలో రకరకాలభావాలు కనిపించి మాయమయ్యాయి. భయం- విచారం- సందేహం- తత్తరపాటు అన్నీ-

'లేడండమ్మాయిగారూ!' అంది వణుకుతున్న కంఠంతో- ముసలితనం వలన కావచ్చు-

'ఎప్పుడు వస్తాడు?'

'ఏమోనండి. చావలేక యిలావున్నాను.' అనేసి గబగబ వెళ్లిపోయింది. నాలుగడుగులు ముందుకు వేశాక 'కండు ఎవరు?' అనడిగాను- కొంతసేపటివరకు సమాధానంరాలేదు.

'మాపొలంలో పనిచేసేవాడు. నాన్నగారు వద్దని పంపించేశారు.'

ఆవేళ ఏకాదశికావటంమూలాన దేవాలయంలో జనం కిటకిటలాడారు. దివ్య మంగళాకారుడు చిరునవ్వులు వెదజల్లుతూ మానవుల మూఢత్వాన్ని ఛేదించి విజ్ఞానదీపాన్ని వెలిగించటానికి కాంతులు, కిరణాలు వెదజల్లుతున్నాడు.

'ఇప్పుడు చెప్పండి- దేవుడు వున్నాడా లేడా?' అనడిగింది అలమేలు. వుందో లేదో తెలియదు. నలుపో, తెలుపో అర్థంకాదు- శాంతిప్రియత్వం ఎంతవరకూ వ్యాపించినది బోధపడదు. అలాంటి వస్తువుకు నామరూపాలు సృష్టించి దానివునికిని నిర్ణయించటానికి ప్రయత్నించటం అవివేకం- మాట్లాడక వూరుకున్నా-

ఆ మర్నాడువుదయం హాల్లోకిరమ్మని రామయ్యరుగారు కబురంపారు. వెళ్లేసరికి ఓ కొత్తవ్యక్తి కనిపించాడు.

'రండి! మీకోసమే ఎదురుచూస్తున్నా. ఈయన ఇన్స్‌పెక్టర్‌సింగారవేలు- మీరు వినేవుంటారు. కనీసం పేపర్లో చదివివుంటారు.'

'రెండూ లేదు' అందామనుకున్నాను. కాని ఆయన బాధపడతాడేమోనని అంగీకార సూచకంగా తలవూపాను. సింగారవేలు నల్లగా నిగనిగలాడుతూ రాయిలావున్నాడు. కోరమీసాలతో వందమందిదొంగల్ని కట్టివేసేవాడిలా కనిపించాడు. పదునెక్కిన కళ్లు- ప్రతి వ్యక్తిని, వస్తువును అనుమానంతోచూసే మనస్తత్వం అతనిది. 'వేలు ఎందుకు వచ్చారని ఆశ్చర్యపోతున్నారు కదూ? ఏడాదిక్రితం నాదగ్గర కండు అనేఅతను పనిచేసేవాడు. ఎంతో విశ్వాసంతో, వినయంతో ప్రవర్తించేవాడు. కాని కాసుమీద ఆసలేనివాడెవడు? ఉన్నట్టుండి ఓ చిన్నదొంగతనంచేసి పట్టుబడిపోయాడు. ఆనాటినుండి గజదొంగైపోయి నామీద కక్షకట్టాడు. ముందు జాగ్రత్తకోసం వేలుగార్ని రప్పించాను. ఆయన్ని నాకు బాగాతెలుసు.'

కండు గజదొంగ- అలమేలుచెప్పినకండు, ఇతనూ ఒక్కరేనా? అలాగైతే అలమేలుకు అతని సంగతెందుకు? మనసులోవున్న అభిప్రాయాల పరావర్తన మొహంమీద

కనిపించిందిగామోలు- వేలు నన్ను అనుమానంగా, పరీక్షగా చూశాడు.

'ఇదంతా మీకుచెప్పటమెందుకంటే, మీరు చాలావూళ్లు తిరగుతూంటారు. అతని ఆచూకీతెలిస్తే వెంటనే తెలియజేయాలి.' అన్నాడు వేలు. 'తప్పకుండా- అరాజకాన్ని అరికట్టడం ప్రతివాడి విధ్యుక్తధర్మం- కాని ఓచిక్కువుంది. అతనిముఖం నేనెప్పుడూ చూడలేదు. ఒకవేళ అతనే నాకెదురుగా వచ్చినా- అతనికే నేను చికిత్స చేసినా, గుర్తుపట్టటం సులభం కాదు' ఇద్దరం నవ్వుకున్నాము- అవునుమరి కండుఫోటో లేదుగా!

ఆ సాయంత్రం-

రాత్రంతా ఆలోచనలమధ్య పడి నలగటం మూలాన నిద్రలేదు. చల్లగాలి జోకొడుతూండగా నిద్రపోతున్నా, ఎవరో తలుపు దబదబబాదుతుంటే అదిరిపడిలేచి కూర్చున్నా. శ్రీధరన్ లోపలకువచ్చి నమస్కరించి కూర్చున్నాడు.

'ఏమోయ్! కులాసా?' అనడిగాను. గడ్డం బాగాపెరిగిపోయింది. కళ్లు రెండూ ఎర్రగా భయకరంగా వున్నాయి. ముఖంమీద యిదివరకున్న ముసలితనం శాఖోపశాఖలు వేసింది.

'మీదగ్గర్నుండి వెళ్లాక తిండితిప్పలు సరిగ్గాలేకుండా చాలాబాధపడ్డాను. ఎక్కడా సరైన నౌఖరీ దొరకలేదు. అనుకున్నపని జరగలేదు. మీరే దయతల్చి నన్ను మళ్లీ కంపెండరుగా చేర్చుకోవాలి.'

ఆ కోర్కె అసందర్భమైందని అతనికీ తెలుసు.

'నీకు తెలియనిదేముంది శ్రీధరన్? కొత్తకంపెండరు పర్మనెంటయ్యాడు. ఏతప్పూ లేనప్పుడు ఎలా డిస్‌మిస్‌చెయ్యటం? అయినా అధైర్యపడకు- మెడ్రాసులో మా మెడికల్ ఆఫీసరున్నాడు. ఆయనకో వుత్తరంరాసిస్తాను- నీ అదృష్టాన్ని పరీక్షించుకో.'

శ్రీధరన్ నవ్వటానికి పెదవులు కదల్చబోయి అశక్తతతో వూరుకున్నాడు.

అతనితో నాకున్న పరిచయం స్వల్పమైనదైనా అతన్నో ప్రియమిత్రుడిగా భావించాను. నన్ను వేధించుకుతింటున్న కండువిషయం అతనితో ప్రస్తావించాను. అతను స్పష్టీకరించిన విషయాలు నెత్తిమీద పిడుగులవాన కురిపించాయి. కండు అందరికంటె విశ్వాసపాత్రుడు- రోజుకు పదహారుగంటలు పనిచేసే వాడు. మంచికీ, చెడ్డకీ మధ్య తెల్లగోడవుందనికూడా తెలియదు. ఉన్నట్టుండి రామయ్యరుగారింటోంచి చిన్నచిన్న వస్తువులు మాయం కాసాగాయి. ఎవరిమీద అనుమానపడటమోకూడా తెలిసింది కాదు. ఓనాడు అలమేలు మెడలోవుండే పదహారుకాసులగొలుసు కండుదగ్గర దొరికింది. ఆ సమయంలో ఆయింట్లో పనిచేసే 'నాక్కన్' తప్పించి మరెవరూలేరు. రామయ్యరుగారి ఇంటి వెనకాల వుండే పెద్ద తోటపనంతా అతనే చేసేవాడు. ఆయన ముక్కోపి- పరిస్థితులు అర్థంచేసుకునే ఓపికలేదు. కండుని దొంగగానిర్ణయించి స్తంభానిక్కట్టి చావగొట్టారు. శ్రీధరన్ చెప్పిన మరోవిషయం నన్ను ఆశ్చర్యంతోముడివేసింది. ఆ దొంగతనం చేసింది నాక్కన్. అతడి కుటుంబం చాలాపెద్దది. దాన్ని సరైన మార్గంలో పోషించలేక ఈ వూబిలోకి దిగాడు. తప్పని తెలిసినా జాలిపడి కండు అతనికి సాయంచేశాడు. దెబ్బలన్నీ తిన్నాడుగాని నిజం చెప్పలేదు.

అప్పట్నుంచీ గ్రామంలో అందరూ అతన్ని దొంగగానిర్ణయించి వేధించుకు తిన్నారు. బహిష్కరించారు. అందరూ కలిసి 'నువ్వు దొంగతనంచేసి బతకాలి- మరెందుకూ పనికిరావు' అని శాసించారు. కండు గత్యంతరంలేక ఆ మార్గాన్ని ప్రేమించటం నేర్చుకున్నాడు. అతనిపేరు పోలీసురిజిస్టరులో స్థానం సంపాదించుకుంది.

'అదేవిటి శ్రీధరన్! ఇంతమంది పోలీసులు- ఆఫీసర్లు- సిఐడిలు ఒక్క దొంగను పట్టలేరూ?'

'మీకు తెలియదండి. ట్రిచూర్ దగ్గరవున్న కుదరాంకున్నులోనే అతనిమకాం. ఆ లోయలోకి వెళ్లటానికి ఎవరికి ధైర్యంవుంటుందికనక'- శ్రీధరన్ వెళ్లిపోయాడు. మరికొంతసేపటికి అలమేలు వచ్చింది.

'ఇందాకా పోలీసతను మీతో చెప్పినదంతా విన్నాను.' అంది చేతులు వెనక్కి కట్టుకుని తల నిలువునా ఆడిస్తూ- సమాధానం రాకపోవటంమూలాన తనే చెప్పుకుపోయింది.

'జాగ్రత్త! కండు చాలాచెడ్డవాడు. కత్తితో పొడిచేసి చంపేస్తాడు. కాళ్లూ చేతులూ విరగ్గొడతాడు. అతనిజోలికిమాత్రం వెళ్లకండి.' నాకు నవ్వాగిందికాదు.

'నాదగ్గర తుపాకీ వుంది- కాల్చేస్తాను.' అన్నాను డాబుగా.

కళ్లల్లో అసహాయత అటునుంచి యిటు కదిలింది.

'అదిసరేకాని అతన్ని గురించి నీకింత శ్రద్ధ ఎందుకు?'

తన నీడను చూసి జడుసుకున్న వ్యక్తిలా త్రుళ్లిపడింది. ఆ చిన్నగుండెలో జరుగుతూన్న మథనం నాకర్థంకాదు.

'చిన్నప్పట్నుండి అతను నన్ను ఎత్తుకుని పెంచాడు. ఎప్పుడూ అతనిదగ్గరేవుంటూ ఆడుకుంటూ వుండేదాన్ని. అతనికూతురు, నేను కలిసి ఆడుకునేవాళ్లం- అమ్మ నాన్న వీలైనంతవరకూ వారించారు. చివరికి చేసేదిలేక వూరుకున్నారు. ఓనాడు ఆ అమ్మాయి నన్ను మేడమెట్లమీదనుండి కిందకు తోసేసింది. రెండుమూడు మెట్లు దొర్లుతూ వచ్చేసరికి నాన్నగారు పట్టుకున్నారు. ఆయనకు కోపంవస్తే వళ్లుతెలియదు. కండుకూతుర్ని చింతబరికె పుచ్చుకుని బాదారు. పదిరోజులు జ్వరంతో బాధపడి ఆమె చచ్చిపోయింది. అప్పట్నించీ కండు నన్ను ముద్దుగాఎత్తుకుని తిరిగే వాడు. నాన్నగారు ఏమీ అనేవారు కారు. ఇదంతా మా యింటోనే- బయటకు ఏవార్తా పొక్కేది కాదు. తెలిస్తే నలుగురూ మమ్మల్ని వెలివేస్తారుకూడా. అతను కనిపించకపోతే ఎలాగోవుంటుంది. అందుకే నేను గుళ్లోకి వెడుతుంటే అతన్నిగురించి అడిగాను. నన్నెవరూ అనుమానించరు- పాపం! వెర్రివాడు కండు!'

ఆమెకళ్లు నీటిగుంటలయ్యాయి.

ఆమె చిన్నహృదయంలో ఒత్తిడిచేత పగలటానికి సిద్ధంగావున్న లక్షన్నరభావాల్లో ఇవికూడా కలిసివుంటాయి. ప్రేమ, అనురాగం- ఈ రెండూ అయస్కాంతాల్లాంటివి. ఒకసారి ఆకర్షించటం మొదలుపెడితే దానిశక్తిని ఎదుర్కోటం, నిర్లక్ష్యపరచటం

సాధ్యంకాదు. అలమేలు మనస్తత్వం నాకు అద్దంలో ప్రతిబింబంలా బాగాఅర్థమైంది. సహజత్వానికి ఓ మెట్టుపైన-

రాత్రి పన్నెండైంది.

దూరంగా రకరకాల అరుపులు వినిపిస్తున్నాయి. కొన్ని మనుష్యుల ఆర్తనాదాల్లా ప్రతిధ్వనించాయి. రాత్రిపూట దయ్యాలు వూరిపొలిమేరవరకూ ఒక్కొక్కప్పుడు వూళ్లోకి - వస్తాయని రాత్రి తొమ్మిదిగంటలుదాటితే ఎవరూ ఒంటరిగా బయటకు వెళ్లరని అలమేలు చాలాసార్లు చెప్పింది. నిశిరాత్రి ఒంటరిగా బయలుదేరివెళ్లి ఈమాటల్లో దాక్కున్న నిజానిజాన్ని రుజువుచేయాలని వెలుతురున్నప్పుడు అనుకున్నా, చీకటి ఒంటరితనం బంధించేసరికి ఆ పథకాలన్నీ గజగజవణుకుతూ పడుకునేవి. దయ్యాలు కేవలం మానవ సృష్టని వాదించినా, అర్థంకాని అస్పష్టధ్వనులు ఎందుకెలా వస్తున్నాయన్న ప్రశ్నకు సమాధానం లభించకపోయేసరికి ఆ క్షణంలో దయ్యాలున్నాయని నమ్మాను. నెమ్మదిగా కిటికీ దగ్గరకు వచ్చాను. ప్రకృతి చీకటి గర్భంలో దాక్కుంది. ఏమీ కనిపించటం లేదు. కేరళ దేశంలో ప్రతిఇంటి వెనక ఓ చిన్న తోట వుండితీరుతుంది. రామయ్యరుగారు స్థితిమంతుడుకనక ఫర్లాంగు పొడవున్న తోటవుంది. ఎడారిలో ఎండమావుల్లా మిణుగురు పురుగుల వెలుతురు తప్పించి మరేమీలేదు. ఆ నిశీధిలో చలిగాలిలో ఏ సత్యాన్వేషణ చేద్దామనుకున్నానోగాని తలుపు దగ్గరగావేసి తోటలోకి వచ్చాను. చంద్రకాంతం పువ్వులు విచ్చి సొగసుగా వూగిసలాడుతున్నాయి. కీచురాళ్లధ్వని గగనంలోకి దూసుకుపోతోంది. మంచు కురుస్తున్నా లెక్కచేయకుండా వర్డ్స్‌వర్త్ వర్ణించిన 'డాఫడిల్స్' పద్యాలను గుర్తుకు తెచ్చుకుంటూ అలాగే నిలబడ్డాను. నాచుట్టూ వెయ్యినాగుపాములు బుసకొట్టినా తెలియదు. అంతటి తన్మయత్వం.

రెండే క్షణాలు!

ఎవరో మెడ గట్టిగాపట్టుకున్నారు. దృష్టిని వెనక్కితిప్పటానికి వీల్లేదు. అసలే దయ్యాన్ని గురించి ఆలోచించానేమో, భయంతో నిర్జీవప్రతిమనై పోయాను.

'ఎవరునువ్వు?' అన్న మొరటుకంఠం వినిపించింది స్వచ్ఛమైన మలయాళంలో.

'ఆయన్నేం చెయ్యకు- వదిలేయి.'

అది అలమేలు కంఠధ్వని- మెడమీదిచెయ్యి సడలింది. వెనక్కి తిరిగి చూశాను. చెవులకున్న దుద్దులు- ముక్కుపుడక తళుక్కుతళుక్కుమన్నాయి.

'ఏవిటిదంతా అలమేలు?' అనడిగాను.

'ఓస్! ఈ మాత్రానికే భయపడుతున్నారా? ఇతనే కండు.'

గుండె జల్లుమంది. హఠాత్తుగా అసాధారణ పరిస్థితులమధ్య చిక్కుకున్నప్పుడు ఎలా ప్రవర్తించాలో తెలియదు. ఎలాంటి ఆలోచనలూ మెదడులో ప్రవహించవు. ఓ పెద్దదొంగముందు నేను నిలబడివున్నాను. అతనెందుకు వచ్చాడు? ఎలా వచ్చాడు? అతని రాక అలమేలుకు ఎలాతెలిసింది? సర్వసాధారణంగా వుదయించే ఈ ప్రశ్నల గుర్తులు

కూడా కనిపించలేదు. అలమేలు నన్ను 'మంచివాడి'గా పరిచయం చేసింది. సింగారవేలు కోర్కె జ్ఞప్తికివచ్చింది. ఈ క్షణంలో ఇతన్ని పట్టివ్వగలిగితే నాపేరు చిరస్థాయిగా నిలబడుతుంది. ప్రభుత్వం ఏదైనా పతకమిచ్చి గౌరవిస్తుంది. 'మీ గదిలోకివెళ్లిపోండి.' అన్నాడు కందు.

ఆ చీకట్లో ఏదో తళుక్కున మెరిసింది. అది పదునైనకత్తి అనుకున్నాను. మరు మాట్లాడకుండా గదిలోకి వచ్చి పడుకున్నాను. అలమేలు నాతో చనువుగా మాట్లాడినందున అతను వూరుకున్నాడుకాని, లేకపోతే అక్కడే సమాధికట్టేవాడు.

నిద్రపట్టలేదు. శరీరంలో ప్రతిఅణువూ రెండుగాచీలిపోయి ద్వంద్వయుద్ధం ప్రారంభించాయి. కర్తవ్యానికీ, అనురాగానికీ మధ్య సంఘర్షణ. అడుగు జారిందేమోననుకుంటే- వయసు పది పన్నెండు సంవత్సరాలు- ఆమె హృదయం నిర్మలమైన సరస్సులాంటిది. అందులో ఇలాంటి నీచభావాలకు స్థానంవుందని ఒక్కసారైనా వూహించుకున్నందుకు సిగ్గుపడ్డాను. కందుముఖం ఆచీకట్లో సరిగ్గా కనిపించలేదు.

నా కర్తవ్యాన్ని మూటగట్టి వుంచినందుకు అంతరాత్మ ఎత్తిపొడిచింది. గతాగతాలు ఎలావున్నా దొంగతనం ధర్మసూత్రానికి కట్టుబడింది కానప్పుడు దాన్ని ప్రతిఘటించటం నా విధి. ఏదోశక్తి నన్ను వశంచేసుకుంది. గబగబలేచి చప్పుడుకాకుండా రామయ్యరు గారు పడుకునే గదిదగ్గరకు వచ్చాను. ఆయన అరుగుమీద మంచంవేసుకుని గురకపెట్టి నిద్రపోతున్నారు. నెమ్మదిగా లేపాను. కొందరు ఎంతటి గాఢనిద్రలో పెనవేసుకుపోయినా సూది కిందపడ్డ చప్పుడుకాగానే మేలుకుంటారు.

'కందు తోటలో వున్నాడు' అన్నాను. అలమేలు కూడా వుందని అనబోయి నాలిక్కరుచుకున్నాను. దానివలన కలిగే అనర్థాలు నన్ను హెచ్చరించాయి.

'ఎవరు? కందు? అతనిని మీకెలా తెలుసు?' అంటూ రామయ్యరుగారు మంచంకింద వుంచిన పెద్దకర్ర తీసుకున్నారు.

'ఎవరో దొంగ- అతడే అయుంటాడనుకున్నా-' అన్నాను కల్పిస్తూ.

'పదండి. మీకు భయంగావుంటేమాత్రం రాకండి.' అన్నారు.

ఆచీకట్లో పళ్లు కనిపించాయి. ఆమాటల్లో హేళన వుందిగామోలు- చిక్కు వచ్చిపడింది. ఆలోచించేందుకు అవకాశం లేదు. నన్ను చూడగానే అలమేలు అంతా పసిగడుతుంది. ఇంక నాకు 'చెట్టిచ్చి'కాయలు ఇచ్చేవారెవరూ వుండరు. ఆయన్ని వెంబడించాను. తోటంతా టార్చిలైటువేసి చూశారు. ఎవరూ కనపడలేదు.

'ఎవడో మామూలు దొంగ అయుంటాడు. తోటలో నాలుగు అరటి గెలలు ముదిరి సిద్ధంగా వున్నాయి. ఎత్తుకుపోవటానికి వచ్చివుంటాడు. పోనిద్దురూ! వాళ్లనికూడా తిననీయండి. నేనే మర్యాదగా పిలిచియిస్తే వూళ్లో పెద్దలునలుగురూ యీసడిస్తారు. ఈ రాక్షసులతోనూ- జిత్తులమారి నక్కలతోనూ పోట్లాడే దానికంటె చాటుగా వూరుకోవటమే మంచిది. వెళ్లి పడుకోండి. గదితలుపులు వేయటం మర్చిపోవద్దు' అనేసి పెద్దగా ఆవులించి

వెళ్లిపోయారు. రామయ్యరుగారన్న చివరిమాటలు నన్ను ఆలోచనల్లోకి విసిరివేసాయి. నిజంగా ఆయనకు కండుమీద కోపం, పగతీర్చుకోవాలన్న అభిప్రాయం వున్నట్టు కనబడలేదు. ఆయనమనసు సముద్రమైతే అందులో అభిప్రాయాలు రత్నాలు, మొసళ్లు-

మర్నాడువుదయం ముఖంమీద అయిదారు నీటిచుక్కలుపడి నిద్రలోవున్ననన్ను మేల్కొలిపాయి.

'అటుచూడండి-అటు-' అంది కళ్లుతెరిచేలోగా అలమేలు- ఎదురుగా కృష్ణుడిపటం వుంది. వద్దన్నా వినకుండా పదిరోజులక్రితం గోడకు తగిలించింది.

'ముందుగా ఆ పటాన్ని ఎందుకుచూడమంటావ్?'

అలమేలు కళ్లుపెద్దవిచేసి గుండ్రంగా తిప్పుతూ 'ముందుగా దేవుణ్ణిచూస్తే ఎలాంటి కష్టాలూ ఎదుర్కోవు. ఈరోజు ఏలాంటినిందలూ మీదపడవు. ఈ చరాచరాలకు ఆయనే కర్తకనక ముందుగానే ఆశీర్వాదంపొందటం అవసరం-' అంది.

లేచి కూర్చునేసరికి అలమేలు నా ముందు ఓ అట్టపెట్టె వుంచింది.

'ఏమిటిదంతా?' అనడిగాను.

'అలా చెప్తే ఇంకేముంది? తెరచి చూడండి- పాములున్నట్లు భయపడతారే?'

పెట్టె తెరిచాను. రకరకాల ఆటవస్తువులు పలకరించాయి. ఆపుకోలేక పెద్దగా నవ్వేశాను. అది ప్రమాదించింది.

'ఎందుకలా నవ్వుతారు? ఇలాంటివి మీరెప్పుడైనా చూసివుంటేగా?' అని ఒక్కొక్కటే తీసి బయట వుంచింది. కీ యివ్వగానే పరుగెత్తే రైలు. అందుక్కావలసిన పట్టాలు- చిన్న కారు- నృత్యంచేసే కోతిబొమ్మ- తల అటూయిటూ వూగిస్తూ ఏదో గానాలాపన చేస్తున్నట్టు కళ్లు గుండ్రంగా సాగసుగా కదిపే రబ్బరుదొరసానిబొమ్మ- ఇంకా ఎన్నో - నాక్కూడా ముచ్చటవేసింది.

'ఇవన్నీ మీనాన్నగారు ఎప్పుడు కొనిచ్చారు?'

'మానాన్నగారు కొనివ్వలేదు.'

'మరి?' టార్చిలైటులో సెల్సు బయటికితీస్తూ అడిగాను.

'నిన్నరాత్రి వచ్చాడే కండు- అతనే కొనుక్కొచ్చాడు.అందుకే వచ్చాడు. బాగున్నాయా?'

చేతిలోవున్న సెల్సు కాళ్లమీద పడ్డాయి. బాధతో మూలుగుతూ వెనక్కి తిరిగాను. ఏదో అనటానికి పెదవులు కదిలాయి. అలమేలు ముఖంలో చెదిరిపడివున్న ఆనందం కళ్లల్లో చేరుకుని వుండేందుకు చోటుచాలక బయటకు వురకటానికి యత్నించింది.

'మరి మీనాన్నగారు చూస్తే ఏమీఅనరూ?'

'ఆయనకు చూపించను- అమ్మకు తెలిసినా ఫరవాలేదు.'

'అంతేలే! మరేం భయపడకు- ఒకవేళ మీ నాన్నగారు చూసినా ఏదో అబద్ధంచెప్పి

తప్పించుకోవచ్చు.'

'ఏమిటి? అబద్ధమా? నా నాలిక కోసేసినా అబద్ధం చెప్పను- దేవుడు శిక్షిస్తాడు. వెనక వోమారు తప్పుచేసినవాళ్లందర్నీ నరకానికి పంపిస్తాడని చెప్పాను జ్ఞాపకంవుందా? మళ్లీ వందజన్మలు ఎత్తినా ఆపాపం పోదు. ఇంత పెద్దవారు మీరుకూడా అబద్ధం చెప్పమంటున్నారా?' అనరిచింది.

ఈ నమ్మకాలన్నీ ఆమెలో వేళ్లు పాతుకుపోయుండాలి. దీనికంతకూ తలిదండ్రులే కారణం అయుండాలి. ఆమెకంటె ఎక్కువ చదువుకున్న నాకు ఓ అబద్ధం (అవసరం వస్తే ఎక్కువ) చెప్పటంలో తప్పేమీ కనిపించలేదు. ముక్కుకు సూటిగ్గా, నీతి నియమాలతో బతికితే ఈలోకంలో కాలుమోపేటందుక్కూడా చోటుదొరకదని, ఏయెండకాగొడుగెత్తిన వాడికే జయం లభిస్తుందని ఆమెకు వివరిద్దామనుకున్నాను. కాని కూలంకషంగా అర్థంచేసుకునే వయసుకాదు. పరిసరాలు, వాతావరణం అందుకనుగుణంగాలేవు. ఓ ఆంగ్ల రచయిత 'నీకిష్టమైతే బురదలోదిగి ఈదులాడు - ఇతరుల్ని అందులో దించకు' అన్నాడు.

'కాని అలమేలు! మానప్రాణరక్షణలకోసం అబద్ధంఆడవచ్చని మనశాస్త్రాలు చెబుతున్నాయిగా!'

'కావచ్చు- కాని ఆ రెండూ పోయేటంత ఆపద ఇంకారాలేదు' అని నవ్వేసింది.

కాని మనం అనుకున్నట్టు అన్నీ జరిగితేసమస్యలు, ఆశాభంగం, గుండెలు బాదుకోటం- ఇలాంటివి ఉండనేఉండవు. రామయ్యరుగారు గదిలో అడుగు పెట్టారు. ఆశ్చర్యాన్ని, తత్తరపాటును దాచుకోడానికి ప్రయత్నిస్తూ ఆయన మాసంభాషణంతా విన్నట్టు ఏదైనారుజువు దొరుకుతుందేమోనని ముఖంవంక చూశాను.

'సాయంత్రం ఓ మాటు మంగలానికి వెళ్లండి- అక్కడ పిచ్చయ్యరుకు వారంరోజులుగా జ్వరమట- కబురంపాడు. అరె!! ఇదంతాఏవిటి? డాక్టరుగారూ! తీరికవేళలో మీరు చిన్నపిల్లల్లా ఆడుకుంటున్నారా?' అనడిగి ఒక్కొక్కటే పరిశీలించారు. సమయానికి తగ్గ ఆలోచన ఏదీ తట్టలేదు.

'కాదు- అవన్నీ నావి.' అంది అలమేలు తడుముకోకుండా.

'ఎవరు కొనిచ్చారు?'

సమాధానం లేదు. ఆ బొమ్మలన్నీ జాగ్రత్తగా పెట్టెలో వుంచి 'పద' అన్నారు. అలమేలు మౌనంగా అడుగులు వేసింది. పర్యవసానంకోసం ఎదురుచూస్తున్నా- అయిదు నిమిషాల్లో ఏడుపులు, పెడబొబ్బలు వినిపించాయి. రామయ్యరుగారిభార్య మధ్యమధ్య ఏదో అరుస్తూంది. అలమేలు నిజంచెప్పి ఉంటుంది. దేహశుద్ధి అవుతోంది. ఈ ఆలోచన ఎందుకో తృప్తినివ్వలేదు. నెమ్మదిగా వెళ్లి కిటికీలోంచి దృక్కులు ప్రసారించాను. ఆయన చింతబరికె పుచ్చుకొని బాదుతున్నారు. ఉద్రేకంతో వెళ్లి చెయ్యిపట్టుకున్నాను.

'క్షమించండి. ఆమెనెందుకలా బాదుకుంటారు?'

'మీకుతెలియదు. ఇది వంశగౌరవానికి సంబంధించినది. అసలు దీనికి మూడేళ్లక్రితమే పెళ్లిచెయ్యవలసింది. మరీ చిన్నపిల్లని వూరుకున్నాను. ఈ బొమ్మలు ఎవరు కొనిచ్చారని అడిగితే జవాబు చెప్పదు. నిజం తెలిసేవరకు నేను వూరుకోను. నాకోపం అలాంటిది. వదలండి. మీపని మీరు చూసుకోండి.' అన్నారు కర్కశంగా.

అలమేలు ఎటూ చెప్పకుండా గోడమీది పిల్లివాటంగా వూరుకుని తన సత్యసంధతను నిలుపుకుందన్నమాట.

'చంపారు. ఇక ఆపండి- నేనే కొనిచ్చాను. మీరేమనుకుంటారోనని చెప్పలేదు. పర్యవసానం ఇంతఘోరంగా వుంటుందనుకోలేదు.'

రామయ్యారుగారు చింతబరికె దూరంగా విసిరివేసి 'పాపిష్ఠి చేతులు' అన్నారు. వంశ గౌరవం- కర్తవ్యం- పితృప్రేమ- చిత్రమైన అర్థంలేనిమాటలు.

ఆ సాయంత్రం.

'ఒక్కసారి అబద్ధం చెబితేచాలు- చిత్రగుప్తుడు మీపేరు రాసుకుంటాడు. యమధర్మరాజు శిక్షిస్తాడు.' అంది చెట్టిచ్చికాయలు పళ్లెంలోపోస్తూ- 'అసలు కండు ఇచ్చాడని చెబుదామనుకున్నాను.'

ఏదోఅనటానికి కనురెప్పలు కదిలాయి- పెదిమలు విడివడ్డాయి- సింగారవేలు లోపలకువచ్చాడు

'కండు ఎప్పుడు వచ్చాడు? ఏం తీసుకొచ్చాడు?' అని నవ్వుతూఅడిగి పెట్టెమీద కూర్చున్నాడు.

'అబ్బే! నేను ఏవో ఆటవస్తువులు కొనిచ్చాను. ఎవరైనాఅడిగితే కండు కొనిచ్చాడని చెప్పమంటున్నా.'

అబద్ధంచెప్పినా నేర్పుగా చెప్పాలి. కాగితంలో చిన్నచిరుగు వుంటే కనిపించినట్లు ఏమాత్రం లోపం వున్నా దాని అసలు రంగు బయటపడుతుంది. నేనుచెప్పిన సమాధానం సముద్రానికి వంతెన కట్టినట్టు ధ్వనించివుంటుంది. సింగారవేలు నమ్మటం కష్టమన్నట్టు తలవూపాడు.

'అవును- రామయ్యారుగారే చెప్పారు- నిన్న రాత్రి మీరూ, కండు కలుసుకున్నారని. మీ స్థానంలో నేనువుంటే అక్కడే హతమార్చేవాణ్ణి. అవకాశంజారిపోయింది.'

అలమేలు వెళ్లిపోయింది.

'రామయ్యారుగారు నమ్మటం లేదుకాని మీరు కండును చూశారని నాకు బాగా తెలుసు. అతనిమీద మీరు కనికరం చూపటం ఎంతమాత్రం న్యాయంకాదు. చట్టానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే మీరూ జైలుకు వెళ్లవలసివస్తుంది. మీకు మంచి భవిష్యత్తు వుంది. దాన్ని చేతులారా నాశనంచేసుకోవద్దు.' అనేసి జవాబుకోసం ఆగకుండా వెళ్లిపోయాడు. నాక్కలిగిన కోపంలో దవడలు రెండూ సాపుచేద్దామనుకున్నాను. ఒక విధంగా అతను

చెప్పినసంగతులు సత్యదూరం కాకపోయినా నిజాన్ని ఒప్పుకోకూడదు. మనసులో వుండే అభిప్రాయాల్ని తెలుసుకునే యంత్రంవుంటే నాలాంటి వారి పరిస్థితి ఎలా వుంటుందో- సింగారవేలు ఇదంతా ఎలా పసిగట్టాడన్న సందేహం నన్ను ఆవరించింది.

ఓనాడు సాయంత్రం రామయ్యరుగారు నన్ను ఇంటోకి రమ్మని కబురు పంపారు. వెళ్లేసరికి చాలామంది కొత్త వ్యక్తులు కనిపించారు.

'ఈయనే మనడాక్టరుగారు, మనింట్లోనే వుంటున్నారు, చాలా మంచివారు' అని పరిచయం చేశారు. నాకు నవ్వొచ్చింది. ఓ మనిషిని పరిచయంచేసేటప్పుడు 'బుద్ధిమంతుడు', 'ధనవంతుడు', 'బాగా చదువుకున్నవాడు', 'వుత్సాహి' అనేదానికంటే, 'మంచివాడు' అనటంలో ఏదో ఔన్నత్యంవుంది. ఆ అమాటలో ప్రత్యేకమైనవిలువ యిమిడి వుంది. మనిషిక్కావలసింది మంచితనమే గామోలు- ఎలాంటి మంచితనం కావాలి? సిసలైన మంచితనం కావాలా? లేక నలుగురిలోనూ నవ్వుతూ మంచిగా నటిస్తే చాలా? ముక్కుకు సూటిగా, మనస్సాక్షి చూపిన దోవంట కాకుండా సంఘాన్ని మెప్పిస్తూ అందరూ నడుస్తున్న తోవంటనడిచే మంచితనమా? ఏది మంచిది? ఏమో! ఎవర్నడిగి తెలుసుకోవాలి?...

'వీళ్లంతా అమ్మాయిని చూసుకోటానికి వచ్చారు. ఈ మకరమాసంలో పెళ్లిచేద్దామని అనుకుంటున్నా. ఇప్పటికే ఆలస్యమైంది. ఈయనే మనఅదృష్టం బాగుంటే కాబోయే అల్లుడుగారు.' అంటూ నా ఆలోచనలకు కళ్లెంవేశారు.

అతనివంక చూశాను- నల్లగావున్నాడు. ఆచారం ప్రకారం చిన్నపిలక వుంది. చేతివేళ్లనిండా రకరకాలవుంగరాలు- పట్టుపంచె- అంగవస్త్రం- నలభైఏళ్లుదాటే వుంటాయి. ముఖంనిండా స్ఫోటకంమచ్చలు- కంకర్రాళ్లలాంటికళ్లు- చూడ్డానికే భయంకరంగా వున్నాడు. విషాదం- కోపం- జాలి- అన్నీ నాలో ఉదయించి మాయమయ్యాయి. అలమేలు ఓ అసాధారణవ్యక్తి. ఆమె అభిప్రాయాలు- ఆశయాలు- అన్నీ గట్టిపునాదిమీద సుందరాతి సుందరంగా నిర్మింపబడిన హర్మ్యంలాంటిది. ఆమె ఒక్క చిరునవ్వును- అతన్ని- త్రాసులోవుంచి తూచితే ఓ పళ్లెం ఆకాశంలో- మరో పళ్లెం పాతాళంలో వుంటాయి.

చీకటికి వెలుగుకు పెళ్లట- మరుక్షణం నన్ను నేను సరిదిద్దుకున్నాను. మనిషిక్కావలసింది కేవలం రూపంకాదు. బాహ్యస్వరూపం గుణాశ్రితం కావచ్చుకాని, దాని విపర్యయంమాత్రం నిజంకాదు. అయినా ఈ విషయంలో నాకెలాంటి అధికారమూ లేదు. మరి కాసేపటికి "సర్వాలంకారభూషితయై" అలమేలువచ్చి అతనికి నమస్కరించింది. ఓ ముసలావిడ మూడునాలుగు గజాలదారాన్ని నేలమీద పరచి దానిమీదుగా నడవమంది. అంగవైకల్యం లేదని నిర్ణయించుకునేందుకు ఇదో పరీక్ష- సంస్కృతశ్లోకాలు చదవమనటం- అన్నీ పూర్తయ్యాయి. వచ్చిన అతిథులందరూ సాయంత్రానికి వెళ్లిపోయారు.

ఆమర్నాడు ఆపెళ్లికొడుకును గురించి వివరాలన్నీ సేకరించగలిగాను. అతనికిది రెండో పెళ్లి. ఆస్తివిషయంలో రామయ్యరుగారికంటె అతనిదే పైచెయ్యి. ఆవూరికంతా

సర్వాధికారైనా దురభ్యాసాలు చాలావున్నాయి. రామయ్యారుగారు ఈ పెళ్లికి ఎలా వొప్పుకున్నారో నాకర్థం కాలేదు. అప్పట్లో వధూవరులు ఒకర్నొకరు చూసుకొని, పరస్పరం యిష్టపడితేనే పెళ్లి చేసుకోవాలన్న సిద్ధాంతం కొత్తగా బయలుదేరింది- అంతేకాని దాన్ని ఆచరణలో పెట్టేవారు వేలలోఒకరు.

'అలమేలు! ఈ పెళ్లికి నువ్వు ఒప్పుకున్నట్టేనా? మీ నాన్నగారు బీదవారు కారు. వెతికి వెతికి ఈ రెండోపెళ్లేవిటి? అదీకాక అతనికీ నీకూ ఏపొత్తూ కుదరదు. అతన్ని పెళ్లి చేసుకోనని మీ నాన్నగారితో కచ్చితంగా చెప్పెయ్. తరువాత పశ్చాత్తాపడడతావు అన్నాను సాయంత్రం. ఆమెకూ నా మాటల్లో వున్న విలువను గ్రహించే శక్తిలేదని నాకుతెలుసు.

'మీరనేది చిత్రంగా వుంది. నాన్నగారికి ఎదురుచెప్పటమే! తప్పు. తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు. వారేం చేసినా మన మంచికోసమే. వూరేగడానికి ఎవరైతేనేం?' అనేసి వెళ్లిపోయింది. అది అమాయకత్వమో- గడుసుతనమో, నిర్లక్ష్యమో- ఇదమిత్థమని తెలియదు. 'కుదరాంకున్ను' లోయలోవున్న క్రూర జంతువుల్ని రోడ్డుమీదనిలబడి చూడలేనట్టు, వర్తమానంలోనిలబడి భవిష్యత్తులోకి తొంగిచూడలేదు అలమేలు. నాలుగైదురోజుల తర్వాత ప్రధానం జరిగింది. ఇంక పెళ్లికి ఒక్కనెలే వుంది.

* * *

ప్రశాంతమైన నీటిని ఎవరో కెలికివేశారు. భవిష్యత్తును తల్చుకుని భయపడేదానికంటే, ధైర్యంగా ఎదుర్కోటం మంచిదనుకున్నాను. సింగారవేలు నన్ను నీడలా అనుసరిస్తున్నాడని పసిగట్టటానికి ఎంతోకాలం పట్టలేదు. అనంతాకాశంలో తుఫానుగాలికి వోమూలగా విసిరివేయబడ్డ ఒంటి మేఘంలా ఫీలయ్యాను. దీనికంతకూ కారణం పిడుగులా ఎగిరివచ్చి పడ్డ వార్త- అలమేలుకు నిశ్చయించిన పెళ్లికొడుకును ఎవరో హత్యచేశారు. వేలుచెప్పిన దాన్నిబట్టి కండు ఆపనిచేసివుంటాడు. ఎందుకు చేశాడన్నది తనకు తెలిసినా బయటపెట్టటం వుచితం కాదన్నాడు. తనకు వూహించే శక్తిలేదని డొంక తిరుగుడుగా చెప్పటం కావచ్చు. అలమేలును అడిగి చూశాను. ఆశ్చర్యంతో నాలుగుసార్లు కనురెప్పలు కదిపింది. చివరకు నాకు నేనే కొన్ని నిర్ణయాలు చేసుకున్నాను. రుజువు చేయలేను కనక అవి సరైనవి కాకపోవచ్చు. అయినా నాకుమాత్రం పూర్వవిశ్వాసం వుంది. అలమేలు ప్రధానం జరిగిన విషయం కండుతో చెప్పి వుంటుంది. అతను అసంతృప్తితో, కోపంతో యీ పనిచేసి వుంటాడు. అందుకు అలమేలు ప్రేరేపణ వుందంటేమాత్రం నేను వొప్పుకోను.

ఆ సాయంత్రం అలమేలు ఓ నిమిషం తనమనసు విప్పింది. రామయ్యారుగారు వూళ్లో లేరు. కండు వూళ్లోనే- తన యింట్లోనే వున్నాడట- జ్వరంతో బాధపడుతున్నాడు. కనక నేను వెళ్లి మందివ్వాలిట- పగలువెడితే ప్రయత్నపూర్వకంగా పర్వతంమీదనుండి వురకటమవుతుంది. అందుకని రాత్రివెళ్లమని కోరింది. మొదట్లో వొప్పుకోకపోయినా తరువాత సరేనన్నాను.

చీకటిని మధ్యమధ్య టార్చిలైటు వెలుతురు జడిపించి పారద్రోలుతోంది. టార్చి కన్ను మూయగానే అంధకారపరిష్వంగం తప్పేదికాదు. చప్పుడవుతుందని జోళ్లుకూడా

వేసుకోలేదు. కాలికి ముళ్లు, రాళ్లు గుచ్చుకుంటున్నాయి. ఆ చీకట్లో నన్నెవరూ వెంబడించరని, చూడరని తెలుసు. అందుకే ధైర్యంగా బయలుదేరాను.

అతని గుడిసె చేరుకునేసరికి గుమ్మందగ్గర నిలబడున్న ముసిల్ది నన్ను ఆనవాలుపట్టి లోపలకు తీసికెళ్లింది. భయంకరమైన నిశ్శబ్దం. మిణుకు మిణుకుమంటున్న చిన్నదీపం- మంచంమీద కండు పడుకుని వున్నాడు. ఆ గుడ్డి వెలుతురులో అతని దృఢకాయం నన్ను భయపెట్టింది. మాసిపోయిన గెడ్డం- రక్తంతో పెరిగినమీసాలు- వంకరగా తిరిగిపోతున్నాయి. ముఖం మీద అయిదారుచోట్ల ఏనాడో కలిగిన గాయాల తాలూకు చిహ్నాలు. గదంతాచూశాను- పదిపన్నెండు సీమవెండిగిన్నెలు- మట్టి మూకుడులు తప్పించి మరేమీ లేవు. అయిదారుగురు పిల్లలు మాత్రం దిసమొలలతో మంచంచుట్టూ నిలబడి వున్నారు- ముసిలితల్లి ఏడుస్తూ ఏదో గొణుగుతోంది. కండు దొంగతనాలు చేశాడా? తనకుటుంబాన్ని ఇలాంటి దరిద్రస్థితిలో వుంచాడా? నాకళ్లను నమ్మలేకపోయాను. జ్వరం సంగతి కనుక్కుని ఇంజక్షనిచ్చాను.

'కండూ! ఈ దొంగతనం మానేసి మంచిగా బతక్కూడదూ?' అనడిగాను. అతను నవ్వాడు. భయంకరంగా పళ్లన్నీ తాళంవేశాయి.

'నేనూ అలాగే అనుకున్నానండి- కాని ఈవూరిసన్నాసులు నన్ను వాళ్లలో చేర్చుకోరు- దుర్మార్గులు. అందర్నీ కట్టగట్టి నరికేస్తాను- జ్వరంతగ్గనివ్వండి.'

'రామయ్యరుగార్ని కూడానా?' అడగాలనే అడిగాను.

'తప్పు. ఆయన దేవుడిలాంటి వాడు- న్యాయాన పోతున్నాడు- ఆయన వుప్పు చాలా కాలం తిన్నాను.'

'అలమేలుకు నీమీద ఇంత అభిమానమెందుకు?'

'ఆమె చెప్పలేదూ?'

'చెప్పింది. నీకూతురు చనిపోయిందని- ఆమెనే నీకూతురుగా భావించుకుని ప్రేమిస్తున్నావని.'

నా వాక్యం ఇంకా పూర్తికాలేదు. కండు వికటంగా నవ్వాడు.

దగ్గుతెర అడ్డుపడేవరకూ- దానికంతు కనబడలేదు.

'అలమేలు తెలివైంది. అసలుసంగతి చెప్పకుండా దాచివుంచింది. చాలాకథవుంది.'

'ఏమిటది?'

'ఇప్పుడు కాదు- రేపు చెప్తాను. ఇవేళ ఆయాసంగా వుంది. మాట్లాడలేను.' విశ్రాంతి తీసుకోమని సలహా యివ్వటంమాని ఎక్కువగా మాట్లాడించినందుకు నేను సిగ్గుపడి మర్నాడు మందుకు రమ్మని బయటకు వచ్చాను. నెత్తిమీదనుండి ఓ పెద్దబరువు దిగినట్టయింది. కండు ఏదో కొత్తవిషయం చెబుతాడు. దాన్నుండి నా వూహలు, మనస్తత్వపు సిద్ధాంతాలు ఎంతవరకూ సరైనవని తెలుసుకోగలను. పదిగజాలు వచ్చేసరికి

ఎవరో భుజం మీద చెయ్యివేసి గట్టిగా నొక్కారు.

'హల్లో డాక్టర్! అర్ధరాత్రి ఇలా బయలుదేరారేమిటి?'

ఆ కంఠధ్వని సింగారవేలుది. నడిసముద్రంలో పడ్డాను. ఈత చేతకాదు. కనుచూపుమేర దూరంలో నావలేవీ కనబడలేదు.

'నాకు తెలుసు- కండుఇంట్లోంచి వస్తున్నారు. అవునా?'

'అవును- అతనితల్లికి జ్వరంగా వుంది. వెళ్లాను' అన్నాను ధైర్యంగా. అతను వికటంగా నవ్వాడు.

'డాక్టరుగారూ! అబద్ధంచెప్పినా నేర్పుగా చెప్పాలి. అరగంటక్రితమే ఆ యింటికి వెళ్లాను. ముసిల్ది దుక్కలావుంది. కండు వచ్చాడని నాకు తెలుసు. ఇల్లంతా పరిశోధించాను. అతని జాడ కనపడలేదు. దీన్నిబట్టి అతన్ని దాచి వుంచటానికి ఏదో గుప్తమైన చోటు వుందన్నమాట. అది కనుక్కోటం కొంచెం శ్రమతోకూడిన పనైనా అసాధ్యంకాదు. కాని వృధాశ్రమ ఎందుకు? మీరు నాకు అండగా వున్నారుగా! పదండి. మీరు వెడితే తలుపు తీస్తారు. లోపలకు రానిస్తారు. అనుమానపడరు.'

అలమేలు ముఖం కనిపించి మాయమైంది. ఆమెకళ్లు ఏదో పెద్దకథను విపులీకరిస్తున్నాయి. కాని అర్థంచేసుకునే శక్తిలేదు నాకు.

'క్షమించండి- ఈ విషయంలో మీకు సాయంచేయలేను- అది నాఅంతరాత్మ బోధనకు విరుద్ధం.'

'అలాగా! దొంగతనాన్ని, దొంగల్ని, ఖూనీలను బలపర్చమని మీ అంతరాత్మ బోధిస్తే అది సిసలైన ఆత్మకాదు- నకిలీ ఆత్మ- దానిమాట వినకండి- మీకు ముందేచెప్పాను. కండు దొరక్కపోతే మిమ్మల్ని తీసుకువెడతాను. మీ భావిజీవితానికి నిప్పు పెట్టుకోకండి- మీమీద చిత్ర విచిత్రమైన ప్రాసిక్యూషన్ నడపగలను.' సింగారవేలు నన్ను ఆలోచించుకోమన్నట్టు రెండు నిమిషాలు వూరుకున్నాడు- ఈ స్వల్పకాలంలో నేను ఏ నిర్ణయానికీ రాలేను. వేలు అన్నట్టు ఎవరికోసమో నా జీవితాన్నెందుకు చీకట్లో ముంచుకోవాలి? అలమేలుకూ నాకూ ఏమిటి అనుబంధం? స్వార్థం నామీద హక్కు చెలాయించింది. తిరిగి కండుయింటికి బయలుదేరాను. అధికారం, బలం, ధనం, ప్రభుత్వ సహకారం, న్యాయం, అన్నీ అతనిపక్షంలో వున్నాయి. ఎగిరిపడుతూ కబళించడానికి సిద్ధమవుతూన్న సముద్రపుటలలతో పోరాడేదానికన్న తలవంచి ఆ కెరటాల వేగానికి అడ్డురాకుండా వుండటమే మంచిది. తలుపుతట్టాను. నా కంఠస్వరం విన్నాక తలుపుతీసింది ముసిల్ది. కండు అనుమానంతో చూశాడు.

'ఏమైంది?' అనడిగాడు.

'మరేం లేదు. మరో ఇంజక్షనుకూడా ఇస్తే నీకు జ్వరం త్వరగా నయమవుతుందని వెనక్కి తిరిగి వచ్చాను... అది సరేకాని అలమేలుకు నువ్వంటే ఎందుకింత అభిమానం? ఇప్పుడే చెప్పకూడదూ?'

'చెబుతాను వినండి.' అంటూ కందు లేచి గోడకానుకొని కూర్చున్నాడు. ఆతురతతో చెవులు నిక్కబొడుచుకుని వినటానికి సిద్ధపడ్డాను. ఎలాంటి కారణాలు వివరిస్తాడో మరి!

టకటకమని బూట్లచప్పుడు- సింగారవేలు నలుగురైదుగురు పోలీసులతో వచ్చి కందుని బంధించాడు.

కందు నాకేసిచూసి పళ్లు పటపట కొరికాడు- ఈ మోసానికా నేను కారకుణ్ణని అతనికి తెలుసు.

* * *

అలమేలు ఎన్నడూ ముక్కుచీది యెరగదు. కాని కందు దొరికిపోయాక ఓ నాడు మేడమీదినుండి కాలుజారి కిందకు దొర్లిపోయింది. అప్పట్నుంచి సరిగ్గా మాట్లాడేదికాదు. ఏవైనా మాటలు బయటకు జారిపడ్డా అసందర్భంగా వుండేవి. ఎన్నో మందులు, ఇంజక్షన్లు వాడిచూశాను- ప్రయోజనం లేకపోయింది. జీవితం నరకతుల్యంగామారింది. రోజుకు ఒక్కసారైనా నేను చేసిన పొరపాటు గురించి మౌనంగా కంటనీరు పెట్టుకునే వాణ్ణి. చివరకు అలమేలును మెడ్రాసు తీసుకుపొమ్మన్నాను.

కొన్ని చిక్కులు వాటంతట అవే విడివడతాయి. రంగూన్‌లో క్వాలిఫైడ్ డాక్టర్లు కావాలని, నన్ను పంపటానికి నిశ్చయించానని మెడికల్ ఆఫీసరు రాశాడు. ఇంక అక్కణ్ణించి వెళ్లిపోవటం సమంజసంగా కనిపించింది. రామయ్యరుగారికి కన్నీటితో కృతజ్ఞత చెప్పుకున్నాను. అలమేలు నడవలేకపోయినా వెళ్లి చెట్టిచ్చికాయలు తీసుకువచ్చింది. కనుచూపుమేరదూరంవరకూ వీడ్కోలిచ్చింది.

బస్సుస్టాండుకు మైలుదూరం నడవాలి. రామయ్యరుగారి పనిమనిషి సామానుతో ముందు నడుస్తున్నాడు. మనసంతా అపూర్వ అనుభవాలతో, నక్షత్రాల మూగవెలుతురుతో నిండిపోయింది. ఒక్క ఏడాదిలో అలమేలు మనస్తత్వం నా హృదయంలో రోజాపువ్వులా వికసించి విశ్వమంతటా వ్యాపించింది.

ఎత్తైయిన కొబ్బరిచెట్లు- భయంకరంగా వురుముతూ చూస్తున్న పడమటి కనుమలు- గుట్టలు- వరిపొలాలు- అన్నీ నన్ను చూసి నవ్వుతున్నాయి. దూరంగా గుడిగంటలు వినిపించాయి. అలమేలు నా హృదయంలో ఆస్తికత్వాన్ని స్థిరం చేయటానికి ప్రయత్నించిన విధానాలన్నీ తళుక్కున మెరిసి మాయమయ్యాయి. కందుగుడిసెకు వెళ్లే 'ఇట్లి' వంకరగా సాగిపోయింది. సింగారవేలు వంకరమూతితో నవ్వాడు. రామయ్యరుగారు చీకట్లో నిలబడి శూన్యంలోకిచూస్తూ 'అలమేలు ఏది?' అనడుగుతున్నారు. ఆ ప్రశ్నకు నేనే సమాధానంచెప్పాలి. అసంతృప్తి- స్వార్థం- అహంకారం- జవాబులేని ప్రశ్నలు- ఇవన్నీ నాలో వున్న ప్రశాంతతను కదిల్చివేశాయి. వెనక్కిపరుగెత్తి అలమేలు దగ్గర వాలిపోదామని పించింది. ఛీ! ఏమిటీ అసందర్భపుటాలోచనలు! ఓ పదిపన్నెండేళ్ల అమ్మాయికోసం నా నిండుజీవితాన్నీ చీకట్లో ముంచటమా?... కారు హారన్ వినపడింది. వర్తమానం, కర్తవ్యం గతాన్ని మరపింపజేశాయి.

అయిదారేళ్లలో ఆమెను మర్చిపోవటానికి ప్రయత్నించి కొంతవరకూ విజయం పొందాను. రంగూన్ నుంచి తిరిగి వచ్చాక మెడ్రాసులో సర్జన్‌గాచేరాను. ఓనాడు శ్రీధరన్ కడుపులో నొప్పని వచ్చాడు. పరీక్షించి ఆపరేషన్ చెయ్యాలని నిశ్చయించాను.

ఆపరేషన్ పూర్తయ్యాక శ్రీధరన్ కోలుకుంటున్నాడు. ఓనాడు అలమేలువిషయం ప్రస్తావించాను.

'ఆమెకూ, కండుకూ ఏమిటి సంబంధం?' అనడిగాను.

'అదా? అదో పెద్దకథ- ఎప్పటికప్పుడు మీకు చెబుదామనుకోటం మర్చిపోవటం జరిగింది- వినండి.' అన్నాడు. ఆశగా చూశాను. శ్రీధరన్ కథ మొదలుపెట్టేలోగా ఆపరేషన్ చేయబడినచోట విపరీతమైన బాధ మొదలైనది. డాక్టర్లు, నర్సులు వచ్చారు. చీఫ్‌సర్జన్‌వచ్చి చూసి పెదవి విరిచాడు. శ్రీధరన్ ఆఖరుఘడియల్లో వున్నాడని నాకుతెలుసు.

'శ్రీధరన్! ఆ కథ చెప్పావుకాదు.' అన్నాను స్వార్థంతో.

'చెప్తాను. అంతకంటే ముఖ్యమైన మరో సంగతి చెప్పటం మరచాను- అలమేలు ఓనాడు కొలనులో కాలుజారిపడి చనిపోయింది.'

అంతే. అతను చివరిసారిగా కన్నుమూశాడు- నా ప్రశ్నలు అలాగే వుండిపోయాయి. కండుకు వురిశిక్ష పడిందని తెలిసింది. అలమేలు ప్రతిరోజూ వుదయం కేరళ దేశపు అలవాటు ప్రకారం స్నానానికివెళ్లేది. ఆమెకు ఈత బాగా చేతనవును మరి ఎలాచనిపోయింది?... ఒకవేళ ఆత్మహత్య చేసుకుందా?... అన్నీ తలా తోకాలేని ప్రశ్నలు- ఒక్కోసారి నిజమనిపిస్తాయి. మరోమారు మిథ్యాబింబాలనిపిస్తాయి.

* * *

ఇదీ కథ-

అంతా చదివారుకనక నా తీరని ప్రశ్నలకు జవాబు చెప్తారనే ఆశతో మీ జాబుకోసం ఎదురు చూస్తున్నా.

మీ ప్రియమైన,

అప్పు.

ఉత్తరం పూర్తయింది. గట్టిగా నిట్టూర్చటం తప్పించి మరేం చేయలేకపోయాను. ఎంతగానో ఆలోచించాను. కాని అతని ప్రశ్నలకు సరైన సమాధానం దొరకలేదు. అదో తీరని సమస్యగా వుంటుందేమోనన్న భయంతో ఈ కథంతా మీకు చెబుతున్నా- మీరు తప్పకుండా సమాధానం చెప్తారన్నఆశమాత్రం నాకుంది.

ఏప్రిల్ 1959 (భారతి)